

గెలుపొందిన భారత జట్టుతో మౌనిక (ఫైల్)

# మౌనిక.. బంగారు పతాక

- మారుమూల పల్లె నుంచి అంతర్జాతీయ స్థాయికి..
- క్రీడల్లో రాణిస్తున్న జిల్లా యువతి
- టెన్నిస్‌బాల్ క్రికెట్‌లో బంగారు పతకం
- భారత జట్టుకు రాష్ట్రం నుంచి ఎన్నికైన ఏకైక క్రీడాకారిణి



ట్రోఫీతో మౌనిక

ధర్పల్లి, డిసెంబర్ 4 : పల్లెలో పుట్టి.. మట్టిలో మాణిక్యంగా మెరిసింది జిల్లాకు చెందిన యువతి. చదువుకుంటూనే అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో రాణిస్తూ బంగారు పతకాలతో ముందుకు సాగుతున్నది ధర్పల్లి మండల కేంద్రానికి చెందిన తంకానే అంజీరాం-విమల దంపతుల కూతురు మౌనిక. ప్రాథమిక, ఉన్నత విద్య మండల కేంద్రంలోనే పూర్తి చేసింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో బీఏ పొలిటికల్ సైన్స్ చదువుతున్నది. చిన్నప్పటి నుంచే ఆటల్లో ఆమెకు ఉన్న ఆసక్తి, ప్రతిభను గుర్తించిన గురువులు ప్రోత్సహిస్తూ వచ్చారు. దీంతో ఒక్కొక్క మెట్టూ ఎక్కుతూ నేడు జిల్లాతోపాటు దేశం గర్వించేలా అంతర్జాతీయ స్థాయికి ఎదిగింది.

కోచ్ లతీఫుద్దీన్ ప్రోత్సాహంతో మండల, జిల్లా, రాష్ట్రస్థాయి నుంచి జాతీయస్థాయి క్రీడల వరకు ఎదిగింది. జాతీయస్థాయిలో నిర్వహించిన క్రీడల్లో సైతం ప్రతిభ చాటడంతో అంతర్జాతీయ క్రీడలకు ఎంపికైంది. మూడు నెలల క్రితం కశ్మీర్‌లో జరిగిన జాతీయస్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఆడిన మౌనికను అంతర్జాతీయ టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపిక చేశారు.

### రాష్ట్రం నుంచి ఎంపికైన ఏకైక క్రీడాకారిణి..

టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌కు తెలంగాణ నుంచి ఎన్నికైన ఏకైక క్రీడాకారిణిగా మౌనిక గుర్తింపు తెచ్చుకున్నది. శ్రీలంకలో నిర్వహించిన ఏషియన్ టెన్నిస్‌బాల్ క్రికెట్ ఫెడరేషన్‌లో భారత జట్టు తరపున ఆడి జట్టు గెలుపులో కీలక పాత్ర పోషించింది. భారత జట్టుకు గోల్డ్ మెడల్ సాధించడంతో మౌనికను గురువులు, గ్రామస్తులు అభినందనలతో ముంచెత్తారు. చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తూ యువతకు ఆదర్శంగా నిలిచిన మౌనిక ప్రతిభను మండల ప్రజలు కొనియాడారు.

### జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ సహకారం..

పల్లెలో పుట్టి ప్రత్యేకమైన టెన్నిస్‌బాల్ క్రికెట్‌లో రాణిస్తున్న మౌనికది పేద కుటుంబం. తన ప్రతిభతో అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు భారత జట్టుకు ఎంపికైనప్పటికీ వ్యక్తిగతంగా ఖర్చుల భరించుకోలేని పరిస్థితి. ఆర్థిక స్థోమత లేక ఇబ్బంది పడుతుంటే స్థానిక బీఆర్‌ఎస్ నాయకుడు, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు పీసు రాజ్‌పాల్ ద్వారా విషయం తెలుసుకున్న ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్.. మౌనిక క్రీడలకు స్పాన్సర్ చేశారు. ఇక ఆమె వెనుదిరిగి చూడలేదు. ఆర్థిక ప్రోత్సాహం లభించడంతో ఉత్సాహంగా భారత జట్టు తరపున అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొని దేశమే గర్వించేలా విజయాన్ని అందించింది. భారత జట్టు గోల్డ్ మెడల్ సాధించడంపై బాజిరెడ్డి జగన్ మౌనికను అభినందించారు.

### మౌనిక విజయాలు..

2013-14: అండర్-17 పాఠశాల స్థాయిలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఖమ్మంలో నిర్వహించిన పోటీల్లో నిజామాబాద్ జట్టు తరపున ఆడారు.

- **2014-15 :** మహిళా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో అండర్-18 రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించారు.
- **2015-16 :** రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించారు.
- **2016 :** ఉత్తరప్రదేశ్‌లో జరిగిన జాతీయ స్థాయి 20-20 పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించి ఆల్‌రౌండర్‌గా ప్రతిభ కనబర్చారు.
- **2017 :** వరంగల్‌లో జరిగిన పోటీల్లో నిజామాబాద్ జట్టు తరపున పాల్గొని ప్రతిభ చాటారు.
- **2018:** హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నారు.



### భారత్ జట్టు తరపున ఆడడం గర్వంగా ఉన్నది

శ్రీలంకలో నిర్వహించిన టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌లో భారత జట్టు తరపున అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనడం గర్వంగా ఉంది. జట్టు విజయంలో నా పాత్ర కూడా ఉండడం జీవితంలో మర్చిపోలేని ఘట్టం. నా ప్రతిభను గుర్తించి చిన్నప్పటి నుంచి ప్రోత్సహించిన నా తల్లిదండ్రులు, గురువులు, కోచ్‌తోపాటు స్పాన్సర్‌షిప్‌ను అందించిన జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు. అందరి ఆశీస్సులతో దేశానికి మరిన్ని పతకాలు తీసుకువస్తా .

-మౌనిక

---

- తొమ్మిదేండ్లలో 18 కొత్త విద్యుత్ సబ్ స్టేషన్లు
- 42 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు
- రైతులకు తీరిన కరెంటు కష్టాలు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కృషి

# పవర్‘ఫుల్’ బాల్కొండ

## పుస్తెలమ్మిన చోట.. పుష్కలంగా కరెంటు




సబ్ స్టేషన్ ప్రారంభోత్సవంలో మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి (ఫైల్)



వరద కాలువ నీటిని ఎత్తిపోసుకునేందుకు రైతులు ఏర్పాటు చేసుకున్న పంపుసెట్లు

కమ్మర్‌పల్లి, డిసెంబర్ 4 : ఉమ్మడి రాష్ట్రంలో బాల్కొండ నియోజక వర్గ రైతాంగం అనేక కరెంటు తిప్పలను ఎదుర్కొన్నది. ఎస్సారెస్పీ నాన్ కమాండ్ ఏరియాలో సాగు నీటికి బోరు బావులే ఆధారం కాగా ఈ ప్రాంతానికి తొమ్మిదేండ్ల క్రితం కరెంటు కొరత తీవ్రంగా ఉండేది. సాగు నీటి వనరులు లేక రైతులు అడుగడుగునా బోరు బావులు వేస్తూ అప్పుల పాలయ్యేవారు. నాణ్యమైన, సరిపడా కరెంటు లేక మోటర్లు పదేపదే కాలి పోతుండేవి. పెట్టుబడి కోసం చేసిన అప్పుడు తీరకుమందే మరమ్మతులకు, కొత్త మోటర్లకు కొత్త బాకీలు చేస్తూ నష్టాల సాగు చేసేవారు. తమ ఇల్లాలి పుస్తెలు కూడా అమ్ముకొని రోడ్డున పడ్డ రైతు కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. పంటలు పండక, అప్పుల బాధలు భరించలేక బలవన్మరణాలు కనిపించేవి. కరెంటు సమస్యలతో వ్యవసాయం చేయలేక తల్లి లాంటి భూమిని అమ్మేసి.. అన్నం పెట్టే రైతులే పొట్ట చేతపట్టుకొని గల్ఫ్‌బాట పట్టిన విషాదాలు కంట తడి పెట్టించేవి. అలాంటి పరిస్థితుల్లో స్వరాష్ట్రం సాకారమయ్యాక కేసీఆర్ ప్రభుత్వం రెండేండ్లలోనే కరెంటు సమస్యలను తీర్చడం మొదలుపెట్టింది. బాల్కొండ నియోజక వర్గంలోనూ ఆ ఫలితాలు అందించడానికి 2014లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన వేముల ప్రశాంత్‌రెడ్డి నడుం కట్టారు. నియోజక వర్గంలో విద్యుత్ సమస్యలపై అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లారు. అప్పటి సీఎం కేసీఆర్‌తో ప్రత్యేకంగా విన్నవించి ఏకంగా పది సబ్‌స్టేషన్లు మంజూరు చేయించారు. పది సబ్ స్టేషన్ల ఏర్పాటుకు ఒకేరోజు శంకుస్థాపన చేయడం రాష్ట్రంలోనే అప్పట్లో చర్చనీయాంశమైంది. రైతుల్లోనూ సంభ్రమాశ్చర్యాలకు గురి చేసింది. అనంతరం మరో 8 సబ్ స్టేషన్లు మంజూరు చేయించారు. నియోజక వర్గానికి కొత్తగా మొత్తం 18 సబ్ స్టేషన్లు సమకూర్చారు. వీటితోపాటు ఏకంగా 42 సబ్ స్టేషన్లలో 5ఎంవీఏ ట్రాన్స్‌ఫార్లను ఏర్పాటు చేయించారు. దీంతో రైతులు తమ భార్యల పుస్తెలమ్మిన చోటనే నేడు పుష్కలంగా కరెంటును అందుబాటులోకి తేవడంతో పుట్లకొద్దీ ధాన్యం పండిస్తున్నారు. తెలంగాణ ఫలాలు ప్రతిబింబించే ఎన్నో మైలు రాళ్లు బాల్కొండ నియోజకవర్గంలో ఉన్నాయి.




ముప్కాల్ మండలం నల్లూర్‌లో నూతనంగా నిర్మించిన విద్యుత్ సబ్ స్టేషన్

---



కోటగిరి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ముఖ గుర్తింపు హాజరు తీస్తున్న టీచర్ (ఫైల్)

# విద్యార్థుల హాజరు లెక్క.. ఇక పక్కా

- ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టమ్‌తో అటెండెన్స్
- వివరాలను నిక్షిప్తం చేసిన టీచర్లు

**ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల హాజరును పక్కాగా నమోదు చేసే ప్రక్రియను విద్యాశాఖ ప్రారంభించింది. ఇక నుంచి విద్యార్థులకు ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టమ్ ద్వారా హాజరు నమోదుకు యాప్‌ను తయారు చేసింది. దీంతో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల హాజరును ఎఫ్‌ఆర్‌సీ ద్వారా ఉపాధ్యాయులు నమోదు చేస్తున్నారు. ఎఫ్‌ఆర్‌సీ అమలు కోసం విద్యార్థుల డేటాను సేకరించింది. దీంతో విద్యార్థుల హాజరు పక్కాగా నమోదవుతున్నది.**

కోటగిరి, డిసెంబర్ 4:

సర్కారు బడుల్లో చదివే విద్యార్థుల హాజరును పక్కాగా నమోదు చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. రిజిస్టర్‌లో అటెండెన్స్‌కు బదులు ఇక నుంచి ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. విద్యార్థుల ఫొటో తీసి ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో అప్‌లోడ్ చేస్తే.. ఏ రోజు ఎంతమంది విద్యార్థులు హాజరు, గైర్హాజరయ్యారనే వివరాలను జిల్లా అధికారులతోపాటు రాష్ట్రస్థాయి అధికారులు ఆన్‌లైన్ ద్వారా తెలుసుకునే వీలున్నది. ఎక్కువ రోజులు పాఠశాలకు రాని విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి సక్రమంగా బడికి వచ్చేలా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

### పక్కాగా పర్యవేక్షణ..

జిల్లాలో 255 జడ్పీహెచ్‌ఎస్, 1196 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు, 10 మోడల్ స్కూల్, 25 కేజీబీవీలు, 3 తెలంగాణ వెల్ఫేర్ పాఠశాలలు ఉండగా, మొత్తం 1,05,000 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. విద్యార్థుల హాజరును పక్కాగా సేకరించేందుకు విద్యాశాఖ ఓ యాప్‌ను ప్రవేశపెట్టింది. ఇందులో విద్యార్థి ఫొటో, వివరాలను రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది. పేరు, తండ్రి, గ్రామం, ఊరు, ఫోన్ నంబర్ తదితర వివరాలను నమోదు చేశారు. ఈ కార్యక్రమంపై అవగాహన కోసం ఇప్పటికే జిల్లాలో కొంతమంది ఉపాధ్యాయులకు శిక్షణను కూడా ఇచ్చారు. ఈ ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టమ్‌తో సర్కారు బడుల్లో విద్యార్థుల హాజరు శాతం గణనీయంగా పెరిగే అవకాశం ఉన్నది. విద్యార్థుల హాజరు ప్రకారం మధ్యాహ్న భోజనం ఎంత మందికి సిద్ధం చేయాలి, పౌష్టికాహారం పక్కాగా అందుతుందా? లేదా .. అనేది తెలుసుకోవచ్చు. ఈ విధానంలో మంచి ఫలితాలు వస్తే దీనిని ఉపాధ్యాయులకు కూడా అమలు చేయనున్నట్లు తెలిసింది. మారుమూల, గిరిజన తండా స్కూళ్లలో బోధన చేస్తున్న ఉపాధ్యాయులు పాఠశాలలకు వెళ్లకుండా హాజరు వేసుకుంటున్నారని, కొంతమంది తమకున్న పలుకుబడితో మేనేజ్ చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టం అందుబాటులోకి వస్తే ఇలాంటి వాటికి చెక్ పెట్టొచ్చని ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

### నిర్లక్ష్యం చేయొద్దు..

విద్యార్థుల హాజరును పక్కాగా నమోదు చేసేందుకు వారి వివరాలను యాప్‌లో నిక్షిప్తంగా చేశాం. ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టమ్ ద్వారా అటెండెన్స్‌లో పారదర్శకత పెరుగుతుంది. ముఖ గుర్తింపు హాజరు నమోదు అమలులో నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవు.

- దుర్గాప్రసాద్, డీఈవో, నిజామాబాద్

### ఏకకాలంలో 20మంది హాజరు నమోదు

విద్యాశాఖ రూపొందించిన నూతన యాప్‌లో క్లాస్ టీచర్ లేదా హెచ్‌ఎం తన స్మార్ట్ ఫోన్‌లో యాప్‌ను ఓపెన్ చేసి తరగతిలో విద్యార్థుల వైపు చూపితే ఒకేసారి 20మంది హాజరును నమోదు చేసుకుంటుంది. ఈ యాప్ ద్వారా ఒకసారి విద్యార్థుల ఫొటోలను నమోదు చేసుకుంటే ఒకటి నుంచి డిగ్రీ పూర్తయ్యే వరకు ఉపయోగపడే అవకాశం ఉన్నది. ఉన్నతాధికారులు కూర్చున్న చోటే సంబంధిత పాఠశాలకు చెందిన వివరాలు, విద్యార్థుల హాజరు తెలుసుకోవాలంటే యాప్‌లోకి వెళ్తే సరిపోతుంది. ఈ యాప్ అమలుతో విద్యాశాఖ వద్ద విద్యార్థుల సంఖ్య పక్కాగా నమోదై ఉంటుంది. దీంతో మధ్యాహ్న భోజనానికి అవసరమైన బియ్యం, యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు తదితర వాటిని పంపిణీ చేసేందుకు అనువుగా ఉంటుంది. ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌లోనే ఎఫ్‌ఏ, ఎస్‌ఏ పరీక్ష ఫలితాలు నమోదు చేయాల్సి ఉండడంతో విద్యార్థుల ప్రగతి నివేదికలు తెలుసుకోవచ్చు. ప్రతి పాఠశాలలో బోగస్ హాజరు నమోదుకు చెక్ పడుతుంది.

